క్లుప్తంగా

బాబా మందిరంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

పొదలకూరు: పట్టణంలోని శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో గురువారం బాబాకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భక్తులు సాయి భజనలు చేశారు. రాత్రి స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

వెంకటేశ్వరస్వామికి గరుడ వాహన సేవ



గరుడ వాహనంపై కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యనోత్సవాల చివరి రోజు గురువారం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయ చుట్టూ రథంపై విహరించారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు స్వామి పాదాలకు మట్టి అంటకుండా నూతన వస్త్రాలను వేసి తిరిగి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎం.శ్యామ్‌ప్రసాద్, దాసరి శ్రీనివాసులు, కొమ్మి వేణుగోపాల్, సన్నికంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో డ్రోన్ సర్వే ప్రారంభం



పొదలకూరు: మూడో విడత భూముల రీసర్వేలో భాగంగా పొదలకూరులో గురువారం డ్రోన్ సర్వేను ప్రారంభించారు. స్థానిక డీఏన్నార్ జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం నుంచి తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ డ్రోన్‌ను ఎగురవేసి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా పట్టణం చుట్టుపక్కల ఉన్న సుమారు 6 వేల ఎకరాల భూములను సర్వే చేసి మ్యాప్ తయారు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత స్వమిత్వలో పంచాయతీ స్థలాలు, చెరువులు, గ్రామకంఠం, గ్రామనత్తం తదితర భూములను సర్వే చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎల్.వెంకటేశ్వర్లు, ఆర్ఐ నవీన్, వీఆర్వోలు శ్రీహరి, అమరావతి, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



మాట్లాడుతున్న ఎంపీడీఓ హేమలత

తోటపల్లిగూడూరు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎంపీడీఓ హేమలత పేర్కొన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పల స్వర్ణలత అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఈ నిధులకు పంచాయితీ నిధులను జోడించి గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణను పక్కాగా అమలుపరుస్తున్నామన్నారు. ఈ విషయంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామీణ ప్రాంతవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎంపీపీ ఉప్పల స్వర్ణలత మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. అనంతరం అన్నిశాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మండల ప్రత్యేకాధికారి చేజర్ల శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షులు చెరుకూరు శ్రీనివాసులనాయుడు, కంజి నీలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాయపు శీనయ్య, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనపై ప్రజల సంతృప్తి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాయినగర్‌లో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై 99 శాతం కుటుంబాలు సంతృప్తిగా ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరు పంచాయతీలోని శ్రీసాయినగర్, బీసీకాలనీ, శాంతినగర్, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో నాలుగో రోజు గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రభుత్వ పథకాలపై ముద్రించిన బుక్‌లెట్‌లను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు 50 సచివాలయాల పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మించడమే కాకుండా తాగునీరు, సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో తాగునీటి సౌకర్యం మెరుగుపరిచేందుకు రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

బురద చల్లడమే ప్రతిపక్షాల పని

టీడీపీ పాలనలో అమలు చేయలేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో అమలు చేసి చూపిస్తున్నారని మంత్రి కాకాణి తెలిపారు. అయితే, ప్రభుత్వంపై బురద చల్లడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకొన్నాయని విమర్శించారు. ఎరువులు సమృద్ధిగా ఉన్నప్పటికీ కొరత ఏర్పడిందంటూ కొందరు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని తెలిపారు. ప్రతిపక్షాలకు విమర్శించే అవకాశం లేకుండా వ్యవహరిస్తామన్నారు. 2019 ఎన్నికలకు ముందు మత్స్యకారేతర ప్యాకేజీ నిధులు గల్లంతైన అంశంపై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు యల్లంగారి వెంకటేశ్వర్లు, షేక్ నవీద్‌బాషా, నాయకులు కె.లక్ష్మణరెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, మునుకూరు జనార్దన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, టి.రాజ, సీపారెడ్డి రామమోహన్‌రెడ్డి, ఈపూరు కోటారెడ్డి, ముత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మ గ్రామోత్సవం



గొబ్బెమ్మ గ్రామోత్సవం

మనుబోలు: మనుబోలులో గొబ్బెమ్మ గ్రామోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగ నెల ప్రారంభం నుంచి మహిళలు గొబ్బెమ్మలు ఆడి తద్వారా వచ్చే నగదు, వంట సరుకులతో చివరి రోజు గొబ్బెమ్మ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. చంద్రమౌళినగర్ పోలేరమ్మ రచ్చ, గొబ్బెమ్మ చావిడి వద్ద గొబ్బెమ్మను ఏర్పాటు చేసి సుగంధ పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మహిళలు ధూప దీప నైవేద్యాలతో పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గొబ్బెమ్మలను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గొబ్బెమ్మను గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.

మత్స్యకార సహకార సంఘం ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన సహకార సంఘం సభ్యులు, అధికారులు

ఇందుకూరుపేట: సహకార సంఘాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎఫ్‌డీఓ సురేష్ తెలిపారు. మండలంలోని మైపాడులో మత్స్యకార సహకార సంఘాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవ్యాస మహర్షి మత్స్యకార సంఘంగా నామకరణం చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా పామంజి మురళి, ఉపాధ్యక్షుడిగా భక్తాని మస్తానయ్య, కోశాధికారిగా కోడి రమేష్‌ను ఎన్నిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త రంజిత్‌రెడ్డి, వీఎఫ్ఏ ఎస్‌కే పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

వేమన తెలుగువాడు కావడం గర్వకారణం



ఇందుకూరుపేట: వేమన చిత్రపటం వద్దం నివాళులర్పిస్తున్న దృశ్యం



వెంకటాచలం: వేమన జయంతి వేడుకల్లో పాల్గొన్న వీసీ జీఎం సుందరవల్లి తదితరులు



ముత్తుకూరు: జెడ్పీ హైస్కూల్‌లో..



కొడవలూరు: వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో..



బుచ్చిరెడ్డిపాళెం: ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

ఇందుకూరుపేట: యోగి వేమన మన తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణమని ఎంపీడీఓ కల్పన అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఖాదర్‌బాషా, ఈఓపీఆర్డీ వసుంధర, సూపరింటెండెంట్ ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో..

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సి.పి.బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు 1839లో పుస్తకం రూపంలో తొలిసారిగా వెలుగులోకి వచ్చాయని, పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజలను మెప్పించారని కొనియాడారు. విశ్వదాభిరామ వినుర వేమ అనే మాట వినని తెలుగువారు ఉండరని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డాక్టర్ కె.సునీత, విద్యాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేమన గొప్ప సంఘ సంస్కర్త

ముత్తుకూరు: వేమన గొప్ప సంఘ సంస్కర్త అని ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం చెంచురామయ్య అన్నారు. వేమన జయంతి సందర్భంగా గురువారం ఆ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ నాటి సామాజంలో మూఢనమ్మకాలపై వేమన తన పదునైన పద్యాలతో తూర్పారబట్టారని గుర్తుచేశారు.

మనో వైజ్ఞానికుడు యోగి వేమన

కొడవలూరు: సమాజంలోని రుగ్మతలను తూర్పారబట్టిన మనో వైజ్ఞానికుడు యోగి వేమన అని హెచ్ఎం టి.వెంకటేశ్వర్లు కొనియాడారు. యోగి వేమన జయంతి సందర్భంగా గురువారం మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వేమన శతక పద్య పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయని బి.శ్రీశైల పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక రామచంద్రాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి దిలీప్ మాట్లాడుతూ తెలుగు పదాలతో సామాన్యులను సైతం జాగృతం చేసిన వ్యక్తి యోగి వేమన అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పద్య పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు విజయనిర్మల, మున్వర్ అహ్మద్, వేణు, బ్రహ్మారెడ్డి, విజయకుమారి, రసూల్‌బేగం, రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్, సీఆర్పీ మల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ముత్తుకూరులో 'గడప గడపకు..'

ముత్తుకూరు: ముత్తుకూరు పంచాయతీలో శుక్రవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెంకటాచలం: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ సుస్మిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చిస్తారని, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం జరిగిన నాకౌట్ మ్యాచ్‌లలో వైసీసీఎం, స్టార్ లెవన్, హెచ్‌సీసీ కొమ్మలపూడి, కట్టువపల్లి జట్లు విజయం సాధించి ముందంజలో నిలిచాయి. మొదటి మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కొండూరు కింగ్స్ నిర్ణీత ఓవర్లలో 48 పరుగులు చేయగా ఆపై 49 పరుగులు చేసిన వైసీసీఎం మనుబోలు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో బద్దెవోలు బ్లాస్టర్స్‌పై స్టార్ లెవన్ మనుబోలు జట్టు విజయం సాధించింది. 3వ మ్యాచ్‌లో ఏడబ్ల్యూ యూత్ జట్టుపై హెచ్‌సీసీ కొమ్మలపూడి జట్టు విజయం సాధించింది. 4వ మ్యాచ్‌లో శివాలయం మనుబోలు జట్టుపై కట్టువపల్లి జట్టు విజయం సాధించింది. మొదటి మ్యాచ్‌లో కావేటి అజయ్‌కుమార్, 2వ మ్యాచ్‌లో సుమన్, 3వ మ్యాచ్‌లో ప్రసాద్, 4వ మ్యాచ్‌లో అంకయ్య మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు శుక్రవారం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు (టౌన్): కర్ణాటకలోని ధార్వాడ్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకు నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్ట్‌లో నారాయణ వైద్య కళాశాలకు చెందిన నాగశ్రీఅంజన, నితీష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, యూత్ అఫైర్స్ మంత్రి అనురాగ్ ఠాకూర్, కర్ణాటక సీఎం బసవ్‌రాజ్ బొమ్మై, తదితరులు హాజరయ్యారు. ఈ క్రమంలో విద్యార్థులను నారాయణ వైద్య కళాశాలలో డీన్ సూర్యప్రకాష్‌రావు, వైస్ ప్రిన్సిపల్స్ జ్యోతి, చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసాద్‌నాయుడు అభినందించారు.

రైతుభరోసా కేంద్రాల తనిఖీ



రేగడిచెలిక ఆర్బీకేలో సిబ్బందికి సూచనలిస్తున్న ఏఓ లక్ష్మి

కొడవలూరు: మండలంలోని రేగడిచెలిక, కమ్మపాళెం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పంట నమోదు, ఎరువుల పంపిణీ తదితర రికార్డులను పరిశీలించి వీఏఏలకు పలు సూచనలు చేశారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన రైతులు ఈ–కేవైసీ చేయించుకోవడం తక్కువగా ఉందన్నారు. వారు ఈ–కేవైసీ చేయించుకొంటేనే చివరి విడత రైతుభరోసా నగదు చెల్లిస్తారని తెలిపారు. ఆమె వెంట వీఏఏలు సుజిత్, నవీన్ ఉన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు వరాలు



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వరాలుగా మారాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన పెదపాళెంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడి వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్ధిని తెలుసుకోవడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయానికి అందించిన రూ.20 లక్షలను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు కోవూరు నియోజకవర్గంలోని 5 మండలాల్లో 53,636 గృహాలను సందర్శించినట్లు తెలిపారు. ముఖ్యంగా మత్స్యకార గ్రామమైన పెదపాళెంను ప్రత్యేక పంచాయతీగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. వేట విరామ పరిహారం కింద సంవత్సరానికి రూ.10 వేల చొప్పున అందించడంతోపాటు వేట సమయంలో ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతిచెందితే రూ.10 లక్షల బీమాను బాధిత కుటుంబానికి ఇస్తున్నట్లు తెలిపారు. గత మూడున్నరేళ్లలో పెదపాళేనికి సంక్షేమ పథకాల ద్వారా రూ.10.72 కోట్లు అందించామన్నారు.

రూ.61 లక్షలు మంజూరు

మండలంలోని 6 పొదుపు సంఘాలకు రూ.61 లక్షల సున్నా వడ్డీ బ్యాంకు రుణాల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే స్త్రీనిధి కింద 6 సంఘాల వారికి రూ.3 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ జగదీశ్వరి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏపీఎం హరి, ఎఫ్‌డీఓ సురేష్, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, ఆవుల వాసు, నాగేశ్వరరావు, సురేంద్రరెడ్డి, మురళీరెడ్డి, శశి, వినోద్, వివేకానందరెడ్డి, అయ్యప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, మల్లికార్జున్‌రావు, భానుప్రకాశ్, జనార్దన్‌రెడ్డి, చెంచురత్నం, శ్రీనివాసులు, తిరుపతి, రాధయ్య, కరుణాకర్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, మస్తానయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌పై చంద్రబాబుది కపట ప్రేమ

ఎన్టీఆర్‌ను మానసిక క్షోభకు గురిచేసి ఆయన మరణానికి పరోక్ష కారణమైన చంద్రబాబు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయనపై కపట ప్రేమను చూపడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. పెదపాళెంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చంద్రబాబు, బాలకృష్ణ ఎన్టీఆర్‌ను పొగడ్తలతో ముంచెత్తారని, అయితే ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్‌ను చంద్రబాబు దించేసే సమయంలో ఎన్టీఆర్ కుటుంబసభ్యులు మానవత్వం ఏమైందని ప్రశ్నించారు. వయస్సు మీద పడిన రామారావుపై వైస్రాయ్ హోటల్ వద్ద చెప్పులు వేస్తుంటే ఆయన కుటుంబసభ్యులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి చంద్రబాబుకు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులకు లేదన్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో ఓటుకు నోటు అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబు ఒక బ్రోకర్ అని, ఆయన దత్తపుత్రుడు పవన్ ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, మేకల పోలయ్య, కొండూరు శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, సర్పంచ్ మేకల ప్రసన్న, ఎంపీటీసీ సభ్యురాలు బుజ్జమ్మ పాల్గొన్నారు.

నేడు బుచ్చి 5వ వార్డులో 'గడప గడపకు..'

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెంలోని 5వ వార్డులో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి స్థానిక సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని విజయవంతం చేయాలని కోరారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



యోగాసనాలు వేయిస్తున్న డాక్టర్ టీవీఎస్ రెడ్డి

కొడవలూరు: యోగాతో మానసిక ఒత్తిడి దూరం చేసుకోవచ్చని యోగా నిపుణుడు డాక్టర్ టీవీఎస్ రెడ్డి తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం యోగాపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన చేయడం వల్ల జీవితం ఉత్సాహంగా ఉండడంతో పాటు చదివిన అంశాలు ఎక్కువ కాలం గుర్తుండిపోతాయన్నారు. అనంతరం ప్రధాన యోగాసనాలు, వాటి ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, డైరెక్టర్లు పి.కృష్ణ చైతన్య, జె.చంద్రమౌళి, ప్రిన్సిపల్ పి.కుమార్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.